
సాక్షి ఒడిశా

శనివారం । 11 । నవంబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు


భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం శుక్రవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.7,31,277లు, బంగారం 2గ్రాముల 150 మిల్లీగ్రాములు, వెండి 12 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



భవిష్యత్ కోసం సాహసోపేత నిర్ణయాలు

సెమీ కండక్టర్ రంగంలో రాష్ట్రం కీలక పాత్ర పోషించే భవిష్యత్తు కోసం బలమైన పునాది వేయడానికి ఒడిశా ప్రభుత్వం అనేక సాహసోపేతమైన మరియు మార్గదర్శక కార్యక్రమాలను చేపట్టిందని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అన్నారు.

- IIలో ▸



రథయాత్ర నుంచి భక్తులకు ప్రవేశం

వచ్చే ఏడాది రథయాత్ర నుంచి గుండిచా ఆలయంలోకి భక్తుల ప్రవేశాన్ని అనుమతించాలని జగన్నాథ ఆలయ అధికార వర్గం (ఎస్‌జేటీఏ) నిర్ణయించింది.

- IIలో ▸

న్యూస్‌రీల్

చెట్టుపడి మహిళ మృతి



గౌరీ మృతదేహం వద్ద కుటుంబ సభ్యులు

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి కంగురుకొండ పంచాయతీ సలిమరికొండ గ్రామంలో శుక్రవారం ఉదయం ఇంటి ముందు గిన్నెలు తోముతున్న మహిళపై చింతచెట్టు పడడంతో మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే.. సరిమరికొండ గ్రామంలో నీలకంఠ పాత్రో కుటుంబం నివాసముంటోంది. అతని భార్య గౌరీ పాత్ర (45) ప్రతిరోజు మాదిరిగానే ఉదయం లేచి ఇంటి బయట చెట్టుకింద గిన్నెలు తోముతుండగా, తనపై ఒక్కసారిగా చింతచెట్టు పడిపోయింది. దీంతో ఆమె స్పృహ కోల్పోయింది. వెంటనే భర్త, ఇతర గ్రామస్తులు అంబులెన్స్‌లో కలిమెల ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడ ఆమెను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. విషయం తెలిసిన కలిమెల పోలీసులు ఆరోగ్య కేంద్రానికి చేరుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతిరాలికి ముగ్గురు కొడుకులు, కుమార్తె ఉంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం



హీరు మృతదేహం

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి సియాడిమాల్ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు దుర్మరణం పాలవ్వగా, మరొకరు గాయపడ్డారు. మృతుడు సమితిలోని సింధూరఘాటి గ్రామానికి చెందిన హీరు మాఝి(40)గా, గాయపడిన వ్యక్తి రాజేంద్ర మాఝి (34)గా గుర్తించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. అలాగే క్షతగాత్రుడిని కాసీపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చికిత్స కోసం తరలించారు. రాజేంద్ర, హీరులు కలిసి బైకుపై తమ గ్రామం నుంచి ఏదో పనిమీద కాసీపూర్ వస్తుండగా, సియాడిమాల్ సమీపంలో ఒక గుర్తు తెలియని వాహనం ఎదురుగా వచ్చి ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాద స్థలంలోనే హీరు మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

మూడు నెలల్లో వంతెన పనులు పూర్తి



సిద్ధమైన బూస్టర్ గార్డర్

రాయగడ: స్థానిక మజ్జిగౌరి మందిరానికి సమీపంలో సుమారు రూ.20 కోట్ల వ్యయంతో జంఝూవతి నదిపై నిర్మితమవుతున్న వంతెన పనులు మరో మూడు నెలల్లో పూర్తి కానున్నాయి. వచ్చే ఏడాది జనవరి 31వ తేదీ నాటికి పనులు పూర్తయ్యి, రాకపోకలు కొనసాగుతాయని సంబంధిత శాఖ అధికారులు శుక్రవారం తెలియజేశారు. రాయగడ నుంచి ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు వంటి రాష్ట్రాలకు అనుసంధానించే వంతెన అత్యంత పురాతనం కావడంతో దాదాపు శిథిలావస్థకు చేరుకుంది. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం 2017వ సంవత్సరంలో జంఝూవతి నదిపై వంతెన నిర్మించేందుకు రూ.20 కోట్లను మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో పొరుగు రాష్ట్రమైన ఆంధ్రాలోని విశాఖపట్నంకు చెందిన ఎస్‌వీఎస్ నూకాంబిక కన్‌స్ట్రక్షన్ అనే ప్రైవేటు సంస్థలకు టెండరు ఇచ్చింది. వంతెన పనులు 2018వ సంవత్సరంలో ముగించాలని ప్రభుత్వం షరతును విధించింది. అనంతరం పనులు ప్రారంభమైనప్పటికీ, మూడుసార్లు వంతెన డిజైన్లు మారడంతో పనుల్లో జాప్యం చోటుచేసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం ఆధునిక టెక్నికల్ విధానంలో రెండు ఫిల్లర్లపై బూస్టర్ గార్డర్‌ను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేసింది. దీంతో జంఝూవతి నదిపై రెండు ఫిల్లర్ల పనులు పూర్తయి అయిదేళ్లు గడిచినా బూస్టర్ గార్డర్ల కోసం నిరీక్షించింది. ఎట్టకేలకు గతేడాది రెండు ఫిల్లర్లపై బూస్టర్ గార్డర్ సామగ్రిని తీసుకు వచ్చింది. అనంతరం సుమారు 61 మీటర్ల పొడవున దీనిని ఇప్పటికే సిద్ధం చేసింది. వీటిని ఫిల్లర్లపైకి ఎక్కిస్తే పనులు పూర్తయినట్లే. అందుకు అవసరమైన యంత్రాలు సమకూర్చడంలో కన్‌స్ట్రక్షన్ కంపెనీ సన్నాహాలు చేస్తున్నట్లు అధికారులు తెలియజేశారు. త్వరలో ఫిల్లర్లపై ఎక్కించే పనులు పూర్తయితే అనంతరం అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఏదిఏమైనప్పటికీ వచ్చే ఏడాది జనవరి 31 నాటికి వంతెన పనులు పూర్తవుతాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

తొక్కిసలాట

- పూరీ జగన్నాథ ఆలయంలో భక్తుల రద్దీ
- దర్శన సమయంలో కిందపడిన భక్తులు
- 10 మందికి స్వల్ప గాయాలు



సింహద్వారం ఆవరణలో భక్తజన సందోహం

భువనేశ్వర్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పూరీ జగన్నాథ ఆలయంలో శుక్రవారం తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ ఘటనలో సుమారు 10 మందికి పైగా భక్తులకు గాయాలయ్యాయి. వీరిలో అత్యధికంగా మహిళలు ఉన్నారు. పవిత్ర కార్తీకమాసం సందర్భంగా తెల్లవారుజామున భక్తులు అధిక సంఖ్యలో దర్శనం కోసం బారులుతీరారు. సింహద్వారం దాటి లోనికి ప్రవేశించే సమయంలో రద్దీ నియంత్రణ అదుపు తప్పింది. ఈ ప్రాంగణంలో రద్దీ నియంత్రణకు బారికేడ్లు వంటి నియంత్రణ వ్యవస్థ లేనందున ఈ విచారకర పరిస్థితి చోటు చేసుకుంది. సింహద్వారం దాటి 7 మెట్ల (సతొ పహంచొ) గుండా ప్రధాన ఆలయంలోనికి ప్రవేశించాల్సి ఉంది. ఈ మెట్ల ప్రాంగణం నుంచి ప్రధాన ఆలయంలో ఘంటీ ద్వారం మధ్యలో తొక్కిసలాట అకస్మాతుగా చోటు చేసుకుంది. రత్న వేదికపై మూల విరాటులకు మంగళ హారతి ముగిసిుడంతో దర్శనానికి అనుమతించడంతో ఒక్కసారిగా కదిలిన భక్తజనం తొక్కిసలాటకు గురయ్యారు. దర్శనం కోసం ఎగబడుతున్న జనం మధ్యలో పలువురు భక్తులు కిందపడి ఊపిరి పీల్చుకోలేక ఉక్కిరిబిక్కిరి అయినట్లు ప్రత్యక్ష సాక్షుల కథనం.

ఆస్పత్రికి తరలింపు

తొక్కిసలాటలో బాధిత వ్యక్తులకు తక్షణమే ఆలయ ప్రాంగణంలో కార్యాలయం ఆవరణకు తరలించారు. ఈ ప్రాంగణంలో ప్రథమ చికిత్స నిర్వహించి అనంతరం స్థానిక జిల్లా ప్రధాన ఆస్పత్రికి అంబులెన్సులో తరలించారు. మంగళ హారతి పూర్తయిన తర్వాత భక్తులను లోపలికి అనుమతించారు. అయితే భారీగా జనం రావడంతో రద్దీ అకస్మాతుగా పెరిగింది. దర్శనం కోసం భక్తులు ఎగబాకడంతో పోటు పెరిగి ఒకరిద్దరు నిలబడలేక జారడంతో అలజడి రేగింది. తొక్కిసలాట వంటి భయానక పరిస్థితి మాత్రం కాదని విధి నిర్వహణలో ఉన్న ఆలయ రక్షక దళం జవానుల సమాచారం. ఈ పరిస్థితిలో కిందపడిన భక్తులకు ఆలయ పోలీసులు చేయూతనిచ్చి ఆదుకున్నారు. సత్వర చికిత్స కోసం బాధితులను ఆస్పతికి తరలించారు. వీరిలో చాలా మంది అవసరమైన చికిత్స తర్వాత వెంటనే డిశ్చార్జ్ అయినట్లు అనుబంధ వర్గాలు తెలిపాయి.

27న రాష్ట్రపతి పారాదీప్ పర్యటన



భువనేశ్వర్: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈనెల 27న జగత్‌సింగ్‌పూర్ జిల్లా పారాదీప్‌లో జరగబోయే బొయితొ బొందొస్ (తెప్పోత్సవం)కు హాజరుకానున్నారు. బొయితొ బొందొస్ వేడుకలో రాష్ట్రపతి ముఖ్య అతిథిగా పాల్గొంటారని రాష్ట్రపతి భవన్ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. దీనిలో భాగంగా ఆరోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఆమె ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. పారాదీప్ పోర్ట్ అథారిటీ (పీపీఏ) ఓడ రేవు పట్టణం పారాదీప్‌లో బొయితొ బొందొస్ కార్యక్రమం నిర్వహించనుంది. ఈ ఉత్సవం ప్రాచీన కళింగ నావికా వ్యాపార వైభవానికి ప్రతీకగా నిలుస్తుంది. ఒడియా నావికులు వాణిజ్యం మరియు సాంస్కృతిక విస్తరణ కోసం బాలి, జావా, సుమత్రా, బోర్నియో (అన్నీ ఇండోనేషియాలో), మరియు శ్రీలంకలోని సుదూర ప్రాంతాలకు ప్రయాణించేవారు. దీంతో వారికి మహిళలు మంగళ హారతులతో హృదయపూర్వకంగా వీడ్కోలు పలకడం ప్రాచీన ఆచారం. దీనిని ప్రతిబింబించే రీతిలో ఈ ఉత్సవం నిర్వహిస్తారు.

కార్తీక పూర్ణిమ రోజున ఈ ఉత్సవాన్ని రాష్ట్రమంతటా కోలాహలంగా జరుపుకుంటారు. ఇది కార్తీక మాసంలో నెల రోజుల పాటు సాగే 'హబిషా' మరియు ఐదు రోజుల 'పంచుక' ముగింపును సూచిస్తుంది.

సాగర్ సుందరీకరణ పనులు ప్రారంభం



స్పిల్‌వే గట్టుని తొలగిస్తున్న బుల్డోజర్



డ్రైన్‌ను శుభ్రపరుస్తున్న సిబ్బంది

జయపురం: చారిత్రాత్మక జయపురం జగన్నాథ్ సాగర్ అభివృద్ధి, సుందరీకరణ పనులు ప్రారంభమయ్యాయి. సాగర్‌లో ఉన్న నీరు, పూడికను తొలగించే పనులు మున్సిపల్ అధికారులు శుక్రవారం చేపట్టారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సాగర్ స్పిల్ వేలో కొంతభాగాన్ని తొలగించి దాని నుంచి నీరు బయటకు వదిలారు. మరో పక్క జయనగర్ కూడలి వద్దనున్న సాగర్ హెడ్ రెగ్యులేటర్‌ను స్తంభింపజేశారు. సాగర్‌లో నీరు పూర్తిగా బయటకు వెళ్లిన తర్వాత బురదను తొలగించనున్నట్లు మున్సిపల్ కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయక్ తెలిపారు.

నీరు నిల్వ అవ్వకుండా చర్యలు

జయనగర్ కూడలి వద్దనున్న సాగర్ హెడ్ రెగ్యులేటర్ ద్వారా నీరు బయటకు వదలాలని ముందుగా నిర్ణయించి, అందుకు అనుగుణంగా కిందనున్న డ్రైన్‌ను పరిశుభ్రపరిచారు. సాగర్ నుంచి విడిచిపెట్టిన నీరు ఇళ్లలోకి చేరకుండా కాలువను లైనింగ్ చేశామని, అయితే రెగ్యులేటర్ వీడనందువలన జయనగర్ ఆశ్రమ స్కూలు సమీపంలోని స్పిల్‌వేను పరిశీలించి, అక్కడ 5 అడుగుల కాంక్రీట్‌ను తొలగించామని పట్నాయక్ వెల్లడించారు. మైనర్ ఇరిగేషన్ సిబ్బంది, మున్సిపల్ పారిశుద్ధ్య శ్రామికులు కలిసి రెగ్యులేటర్ కిందనున్న చెత్తను తొలగించి శుభ్రం చేయడంతో నీరు బయటకు వెళ్తోందని వెల్లడించారు. స్పిల్‌వే నుంచి ఎక్కువగా, రెగ్యులేటర్ నుంచి తక్కువ పరిమాణంలో నీరు వెళ్తోందని పేర్కొన్నారు. సాగర్ నీరు సతి నదిలో కలిసేందుకు మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది భూతనాథ్ మందిరం నుంచి సతి నది వరకు డ్రైనేజ్ ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమాన్ని పారిశుద్ధ్య విభాగ ఇన్‌స్పెక్టర్ శోభన హల్దార్, పి.జగదీశ్వరరావు తదితరులు పర్యవేక్షించారు.

రాష్ట్ర గవర్నర్ రఘుబర్ దాస్ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌ను ఆయన నివాసంలో శుక్రవారం కలిశారు. గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత సౌజన్యాత్మకంగా కలిసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రితో వివరంగా చర్చించినట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి మంచి ఆరోగ్యంతో రాష్ట్ర సేవలో చురుకుగా చిరకాలం కొనసాగాలని ఆకాంక్షించారు. గవర్నర్ రాక ఆనందంగా ఉందని సీఎం తెలియజేశారు. రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై చర్చించామన్నారు. రాష్ట్ర పాలన, ప్రజల సంక్షేమం కోసం ఆయనతో కలిసి పనిచేయడానికి ఉత్సాహంగా ఉన్నామని పేర్కొన్నారు.

- భువనేశ్వర్

● మర్యాదపూర్వక భేటీ



కార్మికులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

- ఎమ్మెల్యే మకరంద ముదులి



కార్మికులకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే ముదులి తదితరులు

రాయగడ: కార్మికులకు అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, భవన నిర్మాణ కార్మికులకు ఆర్థిక సాయం అందజేస్తోందని రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి అన్నారు. స్థానిక బిజూ పట్నాయక్ అడిటోరియంలో జిల్లా కార్మిక శాఖ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకం నుంచి ఆర్థిక సాయం అందించే కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని వర్గాలను ప్రభుత్వం ఆదుకుంటోందన్నారు. ప్రజల ఆదరాభిమానాలు ఉండడంతోనే బీజేడీ రెండు దశాబ్దాలకు పైగా అధికారంలో ఉండి ప్రజలకు సేవ చేయగలుగుతుందని తెలియజేశారు.

సాయం అందజేత

జిల్లా కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ ప్రసన్న కుమార్ పాణిగ్రాహి మాట్లాడుతూ.. ఈ ఏడాది 2023-24 ఆర్థిక సంవత్సరంలో ప్రమాదవశాత్తు మృతి చెందిన 87 మంది కార్మికులకు రూ.1.73 కోట్లు, ఫునరల్ సహాయార్థం మరో 87 మంది కార్మికులకు రూ.4.35 లక్షలు, మెటర్నిటీ సహకారం కింద 11 మంది కార్మికులకు రూ.1.10 లక్షలు, కార్మికుల పిల్లల చదువుల కోసం 20 మందికి రూ.1,87,400లు, వివాహ కార్యక్రమాలకు గాను మరో 46 మంది కార్మిక కుటుంబాలకు రూ.22.75 లక్షల ఆర్థిక సాయం ప్రభుత్వం అందజేసిందన్నారు. అదేవిధంగా మృతి చెందిన మరో 8 మంది కార్మిక కుటుంబాలకు లక్ష రుపాయలు చొప్పున్న ఆర్థిక సాయం అందించిందని వివరించారు. కార్యక్రమంలో రాయగడ మున్సిపల్ చైర్మన్ మహేష్ పట్నాయక్, స్పెషల్ డవలప్‌మెంట్ కౌన్సిల్ చైర్మన్ (రాయగడ) అనసూయా మాఝి, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతీ మాఝి తదితరులు పాల్గొనగా, జిల్లా కార్మిక శాఖ అధికారి జాస్మిన్ సాహు సమావేశానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అతిథులు కార్మికులకు, వారి కుటుంబాలకు ప్రభుత్వం మంజూరు చేసిన ఆర్థిక సాయం చెక్కుల రూపంలో అందించారు.

గుట్కా ట్రక్ సీజ్



మాట్లాడుతున్న ఐఐసీ ప్రశాంత్ భూపతి

బరంపురం/పర్లాకిమిడి: నగర శివారులోని మహరాణిపేట రహదారిలో నకిలీ గుట్కా ట్రక్‌పై పెద్ద బజార్ పోలీసులు దాడిచేసి భారీగా గుట్కా స్వాధీనం చేసుకున్నట్లు ఐఐసీ అధికారి ప్రశాంత్ భూపతి మహంతి శుక్రవారం తెలియజేశారు. గుట్కాను తరలిస్తున్నట్లు ముందస్తు సమాచారం రావడంతో దాడులుచేసి ట్రక్ సీజ్ చేశారు. అనంతరం ట్రక్కుని పోలీసుస్టేషన్‌కి తరలించారు. నిందితులు పరారీలో ఉన్నారని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

నకిలీ నెయ్యి కర్మాగారాలపై

ఉక్కుపాదం



తయారైన నాసిరకం నెయ్యి

బరంపురం: నగరంలోని బరంపురం పోలీసు జిల్లా పరిధితో గత కొద్దికాలం నుంచి అక్రమంగా నడుస్తున్న నకిలీ నెయ్యి కర్మాగారాలపై పోలీసులు వరుస దాడులు చేసి పదుల సంఖ్యలో వివిధ నకిలీ కర్మాగారాలను సీజ్ చేశారు. నగర ఏఎస్పీ రాజేశ్వర్ పండా తెలిపిన వివరాల మేరకు.. గురువారం రాత్రి పెద్ద బజార్ పోలీసుస్టేషన్ పరిధి హౌసింగ్ బోర్డు కాలనీలో నకిలీ నెయ్యి కర్మాగారాలపై బరంపురం పోలీసులు దాడి చేశారు. కర్మాగారంలో ఇంజిన్ ఫుడాయల్, ఇతర రసాయనాలు కలిపిన పేస్ట్‌తో నాసిరకం నెయ్యి తయారు చేస్తున్న యంత్రాలు సీజ్ చేశారు. అలాగే ఈపరి రాజేశ్వర్ పాత్రో అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఐఐసీ అధికారి ప్రశాంత్ భూపతి తెలియజేశారు.



సోదాలు చేస్తున్న ఏఎస్పీ రాజేశ్వర్ పండా



యంత్రాలు తనిఖీ చేస్తున్న పోలీసులు



సీజ్ చేసిన సామగ్రి



నెయ్యి కర్మాగారాలపై దాడులు చేస్తున్న బరంపురం పోలీసులు

క్లుప్తంగా

రాత్రి 10 గంటల వరకే అనుమతి

భువనేశ్వర్: దీపావళి వేడుకల సందర్భంగా జంట నగరాలైన కటక్, భువనేశ్వర్‌లలో ప్రజలు రాత్రి 10 గంటల తర్వాత పటాకులు కాల్చకూడదని కమిషనరేట్ పోలీసులు శుక్రవారం స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా పటాకులు పేల్చితే వారిపై చర్యలు తీసుకుంటామని జంట నగరాల పోలీసు కమిషనర్ సౌమ్యేంద్ర కుమార్ ప్రియదర్శి తెలిపారు. అలాగే దీపావళి రోజున రాత్రి 10 గంటల వరకు కూడా హరిత బాణాసంచా మాత్రమే కాల్చాలని స్పష్టం చేశారు. 125 డెసిబుల్స్ కంటే అధిక శబ్దంతో పేలే బాణాసంచా నిషేధించబడింది. ఈ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. అక్రమంగా పటాకులు పేల్చడాన్ని అరికట్టేందుకు ప్రత్యేక స్క్వాడ్‌లను ఏర్పాటు చేసినట్లు పోలీసు కమిషనరేట్ వెల్లడించింది.

రథయాత్ర నుంచి భక్తులకు ప్రవేశం



గుండిచా మందిరం

భువనేశ్వర్: వచ్చే ఏడాది రథయాత్ర నుంచి గుండిచా ఆలయంలోకి భక్తుల ప్రవేశాన్ని అనుమతించాలని జగన్నాథ ఆలయ అధికార వర్గం (ఎస్‌జేటీఏ) నిర్ణయించింది. ఈ మేరకు శ్రీమందిరం ప్రధాన పాలనాధికారి సీఏవో రంజన్ కుమార్ దాస్ శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ గుండిచా ఆలయ అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభమవుతాయన్నారు. ఈ పనులు పూర్తి కావడానికి ఐదు నుంచి ఆరు నెలల సమయం పట్టే అవకాశం ఉందన్నారు. ఆలయం పరివర్తన పనుల్లో ఆలయ వంట గది (పోటు), కూరగాయలు కోసే ప్రదేశం, ప్రసాద కేంద్రం మరియు పాహండిలో మూల విరాటులను తరలించే పనులు ఉన్నాయని పేర్కొన్నారు. ఆలయ స్థలంలో పార్కు, హాలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ పార్క్ ప్రాంగణంలో ఏడాది పొడవునా మతపరమైన కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఆలయ సుందరీకరణను శ్రీగుండిచా ఆలయ నవకళేబరంగా అభివర్ణించారు. ఈ సన్నాహాలు వచ్చే ఏడాది జరగనున్న స్వామివారి వార్షిక రథయాత్రలోపు పూర్తి చేయాలని భావిస్తున్నట్లు చెప్పారు.

అవుట్ సోర్సింగ్ టీచర్ పోస్టులకు దరఖాస్తులు

సీతంపేట: సీతంపేట ఐటీడీఏ పరిధిలో గల గిరిజన గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ఖాళీగా ఉన్న 7 అవుట్ సోర్సింగ్ టీచర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీవో కల్పనాకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెట్ ఉత్తీర్ణులై, డిగ్రీ/పీజీ కోర్సులు ఇంగ్లీషు మీడియంలో చదివి ఉన్న వారి నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు పేర్కొన్నారు. సీతంపేట బాలుర గురుకుల కళాశాలలో ఖాళీగా ఉన్న ఫిజిక్స్ పోస్టు ఓసీ (జీ)కి కేటాయించినట్లు తెలిపారు. పెద్దమడి బాలుర పాఠశాలలో పీజీటీ గణితం ఓసీ (డబ్ల్యూ), పీజీటీ ఇంగ్లీషు ఎస్సీ (డబ్ల్యూ) కేటాయించామన్నారు. ఏపీఆర్ బాలికల పాఠశాలలో పీజీటీ ఫిజిక్స్ ఎస్సీ (డబ్ల్యూ), సీతంపేట బాలుర పాఠశాలలో టీజీటీ సైన్స్ ఒక పోస్టు ఓసీ (జి), టీజీటీ సోషల్ 2 ఖాళీలకు గాను ఒకటి ఏపీఆర్ గరల్స్‌కు ఓసీ (డబ్ల్యూ), మల్లి పీటీజీ పాఠశాలకు ఎస్సీ (డబ్ల్యూ) కేటాయించినట్లు వివరించారు. ఈనెల 16లోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. 20న స్థానిక బాలుర పాఠశాలలో డెమో నిర్వహించనున్నామని, ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని స్పష్టం చేశారు.

పోక్సో కేసులో ముద్దాయికి జైలు, జరిమానా

బొబ్బిలి: మండలంలోని మెట్టవలస గ్రామానికి చెందిన బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించిన అదే గ్రామానికి చెందిన అడబాల సతీష్‌కు పోక్సో కోర్టు న్యాయమూర్తి కె.నాగమణి రెండు సంవత్సరాల మూడు నెలల జైలు శిక్ష, రూ.1500 జరిమానా విధించారు. ఈ మేరకు బొబ్బిలి పోలీసులు శుక్రవారం తెలిపారు. కేసుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. 2019 నవంబర్ 12న జరిగిన ఈ ఘటనపై అప్పటి ఎస్సై వెలమల ప్రసాదరావు కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. సాక్షులను విచారణ చేసిన అనంతరం పోక్సో కోర్టు న్యాయమూర్తి ముద్దాయిని నిర్ధారించి శుక్రవారం తీర్పునిచ్చారు. స్పెషల్ పీపీగా మావూరి శంకరరావు వ్యవహరించగా సాక్షులను హెచ్‌సీ స్వామినాయుడు ప్రవేశపెట్టారు.

లాంగ్ జంప్‌లో గోల్డ్ మెడల్

విజయనగరం: జాతీయస్థాయిలో జరిగిన లాంగ్‌జంప్ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం జి.లక్ష్మి సత్తా చాటింది. ఈనెల7 నుంచి 10వ తేదీ వరకు చెన్నైలోని కోయంబత్తూర్‌లో జరిగిన జూనియర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో లాంగ్‌జంప్‌లో ఆంధ్రప్రదేశ్ తరఫున ప్రాతినిధ్యం వహించి గోల్డ్‌మెడల్ సాధించింది. 6 మీటర్ల పొడవు జంప్ చేసి ఆంధ్రప్రదేశ్ ఖ్యాతిని చాటిచెప్పింది. ఎస్‌కోటకు చెందిన లక్ష్మి విజయనగరంలోని విజ్జీ స్టేడియంలో కోచ్ సతీష్ వద్ద శిక్షణ పొందుతోంది. జూనియర్స్ విభాగంలో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించిన లక్ష్మిని సెట్విజ్ సీఈఓ బి.రామగోపాల్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు.

భవిష్యత్ కోసం సాహసోపేత నిర్ణయాలు

● సీఎం నవీన్ పట్నాయక్



సినాప్సిస్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: సెమీ కండక్టర్ రంగంలో రాష్ట్రం కీలక పాత్ర పోషించే భవిష్యత్తు కోసం బలమైన పునాది వేయడానికి ఒడిశా ప్రభుత్వం అనేక సాహసోపేతమైన మరియు మార్గదర్శక కార్యక్రమాలను చేపట్టిందని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అన్నారు. నగరంలో సినాప్సిస్ కొత్త కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ కేంద్రం తూర్పు భారతదేశంలో సినాప్సిస్ మొదటి డిజైన్, పరిశోధన మరియు అభివృద్ధి శాఖ కావడం విశేషం. ఇక్కడ వందలాది మంది అత్యంత నైపుణ్యం కలిగిన వీఎల్ఎస్ఐ మరియు సెమీ కండక్టర్ డిజైన్ ఇంజనీర్లు పని చేస్తారు.

పెట్టుబడుల గమ్యస్థానంగా ఒడిశా

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. పెరుగుతున్న పెట్టుబడులకు ఒడిశా భవిష్యత్ గమ్యస్థానంగా ఆవిర్భవించిందన్నారు. సినాప్సిస్ భువనేశ్వర్ సెంటర్ ఆవిష్కరణ ఆర్థిక వృద్ధిని ప్రోత్సహిస్తుందని మరియు యువతకు ఉద్యోగ అవకాశాలను సృష్టిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సాంకేతికతతో నడిచే సంస్థలతో ఆదర్శవంతమైన సెమీ కండక్టర్ హబ్‌గా రూపాంతరం చెందడానికి సహాయపడుతుందన్నారు. ఎలక్ట్రానిక్స్, సాంకేతిక సమాచార విభాగం ప్రిన్సిపల్ సెక్రటరీ మనోజ్ కుమార్ మిశ్రా మాట్లాడుతూ రాష్ట్రంలో ఐటీ, ఐటీఈఎస్, ఈఎస్‌డీఎం రంగాల్లో భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు విభాగం నిరంతరం కృషి చేస్తోందన్నారు. సత్వర ప్రయోజనాలతో సెమీ కండక్టర్ మరియు ఫ్యాబ్ తయారీ రంగంలో రాష్ట్రం సంభావ్య మరియు వ్యయ ప్రయోజనాలను పొందేందుకు ప్రభుత్వం ప్రారంభించిన సెమీ కండక్టర్ ఫ్యాబ్ విధానం ఆశాజనకమైన ఫలితాలు సాధిస్తుందన్నారు. సినాప్సిస్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్స్ మరియు ఐటీ శాఖ సహాయ మంత్రి తుషార కాంతి బెహెరా, 5టీ మరియు నవీన్ ఒడిశా చైర్మన్ వి.కె. పాండియన్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ ప్రిన్సిపల్ సెక్రటరీ మనోజ్ కుమార్ మిశ్రా, ప్రత్యేక కార్యదర్శి మానస్ పండా, సినాప్సిస్ ఉపాధ్యక్షుడు అమిత్ సంఘాని, సినాప్సిస్ ఇండియా గ్రూప్ డైరెక్టర్ (ఆర్ మరియు డీ) రశ్మి రంజన్ మహాపాత్రో, రాష్ట్ర మరియు కేంద్ర ప్రభుత్వాలకు చెందిన పలువురు సీనియర్ అధికారులు, నాయకులు మరియు సినాప్సిస్ నిపుణులు పాల్గొన్నారు.



ప్రారంభోత్సవానికి హాజరైన ప్రముఖులు

ప్రసవ 'వే'దన



దోలీలో ఉన్న గర్భిణి

మల్కన్‌గిరి: జిల్లాలోని కోరుకొండ సమితి నక్కమామ్ముడి పంచాయతీ గంగాపాడ గ్రామానికి చెందిన శాంత బిసోయి అనే మహిళకు శుక్రవారం పురిటి నొప్పులు వచ్చాయి. దీంతో ఆమె భర్త వెంటనే ఆశ కార్యకర్తకు సమాచారం అందజేశారు. ఆమె వచ్చి పరిశీలించి బిడ్డ అడ్డం తిరగడంతో ఆస్పత్రికి తరలించాలని సూచించారు. దీంతో కుటుంబ సభ్యులు అంబులెన్స్‌కు కాల్ చేశారు. అయితే గ్రామానికి అంబులెన్స్ రావడానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో కొందదూరం వరకు గర్భిణిని తీసుకు రావాలని అంబులెన్స్ డ్రైవర్ సూచించారు. దీంతో చేసేదేమీ లేక మహిళను సుమారు 10 కిలోమీటర్లు డోలీలోనే కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. అయితే ఆమె మార్గ మధ్యలోనే పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డలను అంబులెన్స్‌లో కుడుములగుమ్మ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ పరిశీలించిన వైద్యులు బిడ్డ ఆరోగ్య పరిస్థితి బాగులేకపోవడంతో మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అక్కడ తల్లీబిడ్డలు చికిత్స పొందుతున్నారు. ఈ పరిస్థితికి రోడ్డు లేకపోవడమే కారణమని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి గ్రామాలకు రహదారి సౌకర్యాలు మెరుగుపర్చాలని కోరుతున్నారు.



దోలీలో గర్భిణిని తరలిస్తున్న దృశ్యం

ఆరోగ్య శాఖ సమన్వయ కమిటీ సమావేశం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: స్థానిక కలెక్టర్ కార్యాలయంలో గజపతి జిల్లా ఆరోగ్యశాఖ సమన్వయ కమిటీ సమావేశం కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. జిల్లాలో నిమోనియా, కుష్టురోగ నివారణ, హెచ్ఐవీ, ఆరోగ్య పథకాల్లో మిళితమైన అనేక కేంద్ర, రాష్ట్ర పథకాలు, ఆహార భద్రతపై సమీక్షించారు. జిల్లాలోని ప్రతీ పంచాయతీలో ఇంటింటికి వెళ్లి రోగులను గుర్తించి నివేదిక అందించాలన్నారు. ఆరోగ్య విభాగంలో రోగి కల్యాణ సమితి పథకం ద్వారా ఖర్చువుతున్న నిధులను అడిగి తెలుసుకున్నారు. నిమోనియా వ్యాధిని దహనం చేయండి, అప్పుడే బాలల ఆరోగ్యం సుఖమౌతుందన్న నినాదంతో ఉన్న పోస్టర్లలను ఆవిష్కరించారు. సమావేశంలో గౌరవ అతిథిగా అదనపు కలెక్టర్ బీరేంద్ర కుమార్ దాస్, జిల్లా ఆరోగ్య శాఖ సీడీఎంవో డాక్టర్ ప్రదీప్ కుమార్ పాత్రో, అదనపు ముఖ్య చికిత్సాధికారి డా.ప్రమోద్ కుమార్‌పండా, డాక్టర్ ఎంఎం అలీ, జాతీయ స్వస్థ మిషన్ పర్యవేక్షక అధికారి సౌమ్యరాణి గౌడో, డా.నేత్రానంద శథపతి తదితరులు పాల్గొన్నారు.

● గన్ పౌడర్ స్వాధీనం



ఖుర్దా జిల్లా బొలొగొడొ ఠాణా పోలీసులు బాణాసంచా అక్రమ తయారీ శిబిరంపై శుక్రవారం దాడి చేశారు. ఈ దాడిలో బాణాసంచా తయారీకి వినియోగిస్తున్న గన్ పౌడర్ తదితర పేలుడు, బాణాసంచా ముడి సరుకుని స్వాధీన పరచుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

– భువనేశ్వర్

సిమెంట్ లారీ బోల్తా

● డ్రైవర్ మృతి, క్లీనర్‌కు గాయాలు



బోల్తాపడిన సిమెంట్ లారీ

బరంపురం: గంజాం మరియు గజపతి జిల్లాల సరిహద్దు తప్తపాణీ ఘాట్ రోడ్డులో భారీ సిమెంట్ లారీ బోల్తాపడిన దుర్ఘటనలో డ్రైవర్ మృతి చెందగా క్లీనర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మరియు పోలీసు అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని డ్రైవర్ మృతదేహాన్ని బయటకు తీశారు. బమ్మణిగాం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శుక్రవారం సాయంత్రం 4 గంటల సమయంలో అవిభక్త గంజాం జిల్లా సరిహద్దు తప్తపాణి ఘాట్ రోడ్‌పై బరంపురం వైపు వస్తున్న భారీ లారీ పల్టీ కొట్టింది. ఘటనలో ఖుర్దా జిల్లా జట్నీకి చెందిన డ్రైవర్ లోక్‌నాథ్ సాహు అక్కడికక్కడే మృతి చెందాడు. క్లీనర్‌తో పాటు ట్రాక్‌పై వెళ్తున్న మరో ఆరుగురు వ్యక్తులకు సైతం గాయాలయ్యాయి. గాయపడిన వారిని దిగపపండి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బంగారం చోరీకేసులో నిందితుల అరెస్ట్

జామి: బంగారం ఆభరణాల చోరీ కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్‌చేశారు. ఈ అరెస్ట్ వివరాలిలా ఉన్నాయి. జామి మండలంలోని భీమసింగి గ్రామంలో ఈ ఏడాది ఆగస్టు నెలలో కంది గురునాయుడు ఇంట్లో బంగారం చోరీకి గురైంది. ఈ ఘటనలో పోలీసులు విచారణ చేపట్టి నెల్లిమర్ల మండలం జరజాపుపేట గ్రామానికి చెందిన అవనాపు అప్పలస్వామి ఉరఫ్ బిల్లా, బుగత రాజేష్ ఉరఫ్ చింతపిక్కలోడు అనే ఇద్దరు నిందితులను జామి ఇన్‌చార్జ్ ఎస్సై లోవరాజు అరెస్ట్ చేశారు. వారి నుంచి ఆరు తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని జ్యుడిషియల్ రిమాండ్ నిమిత్తం ఎస్.కోట కోర్టుకు తరలించినట్లు ఇన్‌చార్జ్ ఎస్సై చెప్పారు.

మొబైల్ ఫోన్ చోరీ

జయపురం: స్థానిక పబ్లిక్ ప్రాసిక్యూటర్ శైలజ పట్నాయిక్ సెల్‌ఫోన్, బ్యాగ్‌ను ముగ్గురు దొంగలు లాక్కుపోయిన ఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. జయపురం పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటన వివరాలు జయపురం పోలీసు అధికారులు శుక్రవారం వెల్లడించారు. జయపురం కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ శైలజ పట్నాయక్ రాత్రి 8 గంటల సమయంలో జయపురం చందనబెడ ఉన్నత పాఠశాల రోడ్డులో వెళ్తుండగా, ముగ్గురు దుండగులు ద్విచక్ర వాహనంపై వచ్చి ఆమె వద్దనున్న సెల్‌ఫోన్, బ్యాగ్‌ను లాక్కున్నారు. ఈ మేరకు ఆమె ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామన్నారు. సబ్ ఇన్‌స్పెక్టర్ సిద్ధాంత బెహర కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

రాష్ట్రస్థాయి సైన్స్ పోటీలకు కంచరాం విద్యార్థినులు



రాజాం సిటీ: డీఈఓ లింగేశ్వరరెడ్డి చేతుల మీదుగా జిల్లాస్థాయి ప్రశంసా పత్రం, మెమెంటోలుఅందుకుంటున్న విద్యార్థినులు



రేగిడి: విద్యార్థి తేజేశ్వరరావును అభినందిస్తున్న హెచ్‌ఎం తదితరులు



సాలూరు: రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న డీఈఓ

రాజాం సిటీ: రాష్ట్రస్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్ ప్రదర్శనకు మండల పరిధిలోని కంచరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినుల ప్రాజెక్ట్ ఎంపికైందని భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు పండూరు వేణుగోపాల్ శుక్రవారం తెలిపారు. విజయనగరంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో పాఠశాల విద్యార్థినులు కరణం వరలక్ష్మి, పెనుబోతు సౌజన్య ప్రదర్శించిన 'సంప్రదాయ పద్ధతిలో చిరుధాన్యాల పొడి' అనే ప్రాజెక్టు ఎంపికైందని చెప్పారు. ఈ నెల 29, 30 తేదీలలో గుంటూరులో జరగనున్న రాష్ట్రస్థాయి ప్రదర్శనలో తమ పాఠశాల విద్యార్థినులు పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినుల ప్రతిభపట్ల హెచ్‌ఎం వీవీ వసంతకుమార్‌తోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

కాగితాపల్లి విద్యార్థులు కూడా..

రేగిడి: మండలంలోని కాగితాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి తయారుచేసిన ప్రాజెక్ట్ రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికైంది. ఈ విషయాన్ని ప్రాజెక్ట్ గైడెన్స్ ఉపాధ్యాయుడు గొర్లె రమేష్ శుక్రవారం తెలిపారు. ఈనెల 9న విజయనగరంలో జరిగిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ఎనిమిదవ తరగతి విద్యార్థి డి.తేజేశ్వరరావు ప్రదర్శించిన డెంగీ నివారణలో మొక్కల ప్రమేయమనే ప్రాజెక్ట్ ప్రథమస్థానం సాధించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ తయారుచేసిన విద్యార్థిని పాఠశాల హెచ్‌ఎం.ఆర్.సుధాకర్, ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు, బి.ఎరకయ్య తదితరులు అభినందించారు.


రాష్ట్రస్థాయికి ఎంపికైన మామిడిపల్లి విద్యార్థులు

సాలూరు: మండలంలోని మామిడిపల్లి జెడ్పీహెచ్ పాఠశాలకు చెందిన విద్యార్థులు 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా కేంద్రంలో గురువారం జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో మూఢనమ్మకాలపై ప్రత్యేక నాటికను మామిడిపల్లి విద్యార్థులు గంగవంశం చరిష్మ, గిరీష్, శ్రీజ, సుదీప్, రోహిత్,ఉదయశ్రీలు ప్రదర్శించి ప్రతిభ కనబరిచారు, ఈ మేరకు ఈ బృందాన్ని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు జిల్లా న్యాయనిర్ణేతలు తెలిపారు.

పంది అనుకుని ప్రాణం తీశారు..!

శృంగవరపుకోట: మండలంలో సర్వత్రా చర్చనీయాంశమైన గిరిజన యువకుడి హత్యోదంతంలో కొత్త కోణాలు వెలుగు చూస్తున్నాయి. కొత్త అద్దతీగ గ్రామంలో గిరిజన యువకుడిపై దాడిచేసి చంపారన్న వార్తల్లో వాస్తవం లేదని చెబుతున్నారు. హత్యకు గురైన పాంగి అర్జున్ గ్రామానికి దగ్గరలో ఉన్న అనాథాశ్రమంలో పనిచేస్తూ, కుటుంబంతో ఉంటున్నాడు. గురువారం సాయంత్రం పుట్టగొడుగుల కోసమని పొదల వెనుక వెదుకులాడుతుండగా, అదే సమయంలో అడవి పందుల వేట కోసం వచ్చిన కొంతమంది పొదల్లో కదలికలు చూసి నాటు తుపాకీతో కాల్చడంతో అర్జున్ గాయపడి కేకలు వేయగా వారంతా రక్షించే ప్రయత్నం చేశారు. అయితే అప్పటికే పరిస్థితి విషమించడంతో గ్రామంలోకి సమాచారం చేరవేసి నిందితులు జారుకున్నారు. 108లో అర్జున్‌ను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. ఘటనాస్థలిలో విచారణ చేసిన పోలీసులు ఈ ఘటనలో 16 మంది నిందితులు ఉన్నట్లు గుర్తించి, 12 మందిని, అదుపులోకి తీసుకుని, వారి నుంచి నాటుతుపాకీ స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఇదే విషయమై ఎస్‌కోట ఎస్సై తారకేశ్వరరావును వివరణ కోరే ప్రయత్నం చేయగా అందుబాటులో లేరు. మిగిలిన నలుగురు నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. వారిని అదుపులోకి తీసుకున్న తర్వాత పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. మృతుని భార్య కాంతం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అండర్-19 స్కూల్ గేమ్స్ పోటీలకు జిల్లా జట్ల పయనం



సైక్లింగ్ పోటీలకు బయల్దేరిన జిల్లా క్రీడాకారులు



సాఫ్ట్‌బాల్ పోటీలకు వెళ్తున్న జిల్లా జట్టు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న అండర్-19 స్కూల్ గేమ్స్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్లు శుక్రవారం బయలుదేరాయి. ఈనెల 11 నుంచి 13వ తేదీ వరకు విజయవాడలో జరగనున్న బాల, బాలికల సైక్లింగ్ పోటీలతో పాటు గుంటూరు వేదికగా జరగనున్న సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా జట్లు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయి. ఈ సందర్భంగా అండర్-19 స్కూల్ గేమ్స్ అసోసియేషన్ కార్యదర్శి పీవీఎల్ఎన్ కృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించిన క్రీడాకారులు పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనకబరచాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు వ్యాయామ అధ్యాపకులు, జట్ల కోచ్ అండ్ మేనేజర్‌లు పాల్గొన్నారు.

పాడి అభివృద్ధిపై శ్రద్ధ

● మెగా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

● జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు, వేదికపై ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, పశుసంవర్ధక శాఖ అధికారులు

చీపురుపల్లి:

పాడిసంపద అంతరించిపోతున్న తరుణంలో పాడి పశువుల సంపద అభివృద్ధి చేసి పాల విప్లవాన్ని తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు మండలంలోని పేరిపి గ్రామంలో శుక్రవారం పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరం పైలట్ క్యాంప్‌ను ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు అక్కడ ఏర్పాటు చేసిన ఉచిత మందులు, ల్యాబొరేటరీ తదితర స్టాల్స్‌ను పరిశీలించారు. అలాగే పాడి రైతులకు పలు వస్తువులను పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ పాడి సంపదతోనే ప్రతి ఇంటిలోనూ ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని భావించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాడి సందపపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. అందులో భాగంగానే అమూల్ వంటి దిగ్గజ సంస్థలను రాష్ట్రంలోకి తీసుకొచ్చి పాడి రైతులకు అండగా నిలిచారని అన్నారు. పైలట్ క్యాంప్‌లో భాగంగా పశు మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారని, తరువాత కాలంలో ప్రతి మండలంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అంతే కాకుండా మూగజీవాలకు అత్యవసరంగా 24 గంటలు చికిత్స అందించేందుకు అత్యవసర అంబులెన్స్‌లు తీసుకువచ్చినట్లు స్పష్టం చేశారు. మేకలు, గొర్రెలు పెంపకందారులకు వలలు, టార్చ్‌లైట్లు, రెయిన్ కోట్లను యాభైశాతం నిధులతో జిల్లా పరిషత్ నుంచి పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు.

పాల ఉత్పత్తి పెరిగింది.....

వైఎస్సార్ సిపి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాడి సంపదపై తీసుకున్న ప్రత్యేక దృష్టి కారణంగా పాల ఉత్పత్తి పెరిగిందని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. పశు ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుందన్నారు. పాడి పశువుల పోషణ కోసం రాయితీపై దాణా అందిస్తున్నారని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర పశు సంవర్ధకశాఖ డైరెక్టర్ డా.ఆర్.అమరేంద్ర కుమార్, అడిషనల్ డైరెక్టర్లు డా.వి.సింహాచలం, డా. వెంకటరావు, డా.సత్యకుమారి, జాయింట్ డైరెక్టర్ విశ్వేశ్వరరావు, డిప్యూటీ డైరెక్టర్ వై.వి.రమణ ఎంపీపీ ఇప్పిలి వెంకటనర్సమ్మ, జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, సర్పంచ్ కోరాడ భాగ్యరాజ్, తహసీల్దార్ ఎం.సురేష్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ గిరిబాల, పశువైద్యులు డా.జయకాంత్, మోహన రావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కిడ్నీ ఆస్పత్రి ప్రారంభ తేదీలో మార్పు

కాశీబుగ్గ: పలాసలో రాష్ట్ర ప్రభుత్వం రూ.50 కోట్లతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కిడ్నీ రీసెర్చ్ సెంటర్, 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ప్రారంభ తేదీ మార్పు చేస్తున్నట్లు మంత్రి క్యాంప్ కార్యాలయం నుంచి సమాచారం వెలువడింది. ఈ నెల 23వ తేదీ గురువారం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పలాస రావాల్సి ఉండగా అదే రోజు ఏకాదశి సందర్భంగా ప్రజలకు ఇబ్బందికరంగా ఉంటుందని భావించి 25, లేదా 29 తేదీలను ప్రారంభానికి పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

శ్రీకూర్మనాథాలయ హుండీల ఆదాయం రూ. 12,26,382


హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

గార: శ్రీకూర్మనాథాలయంలోని హుండీలను శుక్రవారం తెరచి లెక్కించగా రూ. 12,26,382 లు వచ్చిందని ఆలయ ఈఓ జి.గురునాథం తెలిపారు. శ్రీకూర్మనాథాతో పాటు ఉపాలయమైన పాతాళ సిద్ధేశ్వరస్వామి ఆలయ హుండీలనురచి లెక్కించారు. గదుతో పాటు కిలో 224 గ్రాముల వెండి కూడా లభ్యమైంది. కార్యక్రమంలో జీవీబీ రవికుమార్, పాలకమండలి సభ్యులు డబ్బీరు శ్రీనివాసరావు, అనుపోజు నాగరాజు, జి.లక్ష్మణాచార్యులు, ఎస్. పద్మనాభాచార్యులు పాల్గొన్నారు.

మల్లన్న ఆలయం హుండీ ఆదాయం లెక్కింపు

టెక్కలి: టెక్కలి మండలం రావివలస ఎండల మల్లికార్జునస్వామి ఆలయం హుండీ ఆదాయాన్ని శుక్రవారం లెక్కించారు. పాతపట్నం నీలమణిదుర్గ ఆలయం ఈఓ టి.వాసుదేవ రావు, మల్లన్న ఆలయం ఇన్‌చార్జి ఈఓ జి.ప్రసాద్‌బాబు, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఎస్.సుధాకర్ పర్యవేక్షణలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు. మొత్తం రూ.1,35,103 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. అలాగే ఆలయంలో స్వామి వారికి భక్తులు సమర్పించే తల నీలాల హక్కు కోసం బహిరంగ వేలం నిర్వహించారు. ఏలూరుకు చెందిన తమ్మన శివప్రవీణ్ ఏడాది కాల పరిమితికి రూ.2,15,000కు వేలం పాటతో తల నీలాల హక్కును సొంత చేసుకున్నారు.

పార్టీ గెలుపునకు కృషి చేయండి

శ్రీకాకుళం రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికీ వివరించాలని రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్ స్టాంప్స్ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు కోరారు. పెదపాడులోని ధర్మాన క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం రాత్రి పలువురు యువకులు మంత్రిని కలిసి పార్టీలోకి చేరారు. ప్రతి ఒక్కరికీ పార్టీ కండువా వేసి ఆయన పార్టీలోకి ఆహ్వానించారు. శ్రీకాకుళంలో మంత్రి ధర్మాన గెలుపునకు అంతా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బాణాల దాలినాయుడు, బాణాల రామినాయుడు, తదితరులు ఉన్నారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయం

ఆమదాలవలస: ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు బి.కాంతారావు అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా రెండో రోజు శుక్రవారం ఆమదాలవలస పట్టణంలో మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్లు (ఎండీయూ) వాహనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పట్టణంలోని ఐజీ నాయుడు కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. అలాగే లక్ష్మీ టాకీస్, ఐజీనాయుడు కాలనీలో ఉన్న చౌక ధరల దుకాణాలను పరిశీలించారు. లక్ష్మీ నగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఫోర్టిఫైడ్ రైస్‌పై ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించాలన్నారు. ఫోర్టిఫైడ్ బియ్యం అమ్మడం, కొనడం చెయ్యకూడదని ఆయన అన్నారు.

'అర్హులను ఓటర్లుగా చేర్పించాలి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: పద్దెనిమిదేళ్లు నిండిన వారిని ఓటర్లుగా చేర్పించాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ పిలుపునిచ్చారు. డిగ్రీ, పీజీ కళాశాలల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించి నూతన ఓటర్ల నమోదు కార్యక్రమం చురుగ్గా జరిగేలా చూడాలని పేర్కొన్నారు. ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల తర్వాత జిల్లా వ్యాప్తంగా వచ్చిన ఫిర్యాదులు, విజ్ఞప్తులపై జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌తో కలిసి ఆర్డీవోలు, తహసీల్దార్లతో ఆయన శుక్రవారం సమీక్షించారు. తుది ఓటర్ల జాబితా వచ్చే ఏడాది జనవరి 5న ప్రచురిస్తామని అప్పటికి ఓటర్ల జాబితా పూర్తి స్థాయిలో మదింపు జరగాలని తెలిపారు. బూత్ లెవెల్ అధికారులతో తహసీల్దార్లు ఎప్పటికప్పుడు ముఖాముఖి సమావేశాలు నిర్వహించడం ద్వారానే అది సాధ్యమవుతుందని తెలిపారు. డిసెంబర్ 2, 3 తేదీల్లో మరోసారి బూత్ లెవెల్ స్థాయిలో ప్రత్యేక కార్యక్రమాలు ఉన్నాయి గనుక ఇప్పటినుంచే అందుకు తగ్గ ప్రణాళికల రూపొందించుకోవాలని వివరించారు. 2024 ఎన్నికల నిర్వహణకు జిల్లాలో 288 సెక్టోరియల్ అధికారుల నియామకాలు పూర్తయ్యాయని పేర్కొన్నారు. అదే స్థాయిలో పోలీసు అధికారుల నియామకం త్వరలో పూర్తవుతుందన్నారు. ఓట్ల తొలగింపు సమయంలో బూత్ లెవెల్ ఏజెంట్ల సంతకాలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు.

కరువు ప్రాంతాలపై నివేదికలివ్వండి

- జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

శ్రీకాకుళం పాతబస్టాండ్:

వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో కరువు ప్రాంతాలను గుర్తించి ప్రభుత్వానికి నివేదికలు పంపించాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. నీటిపారుదల సలహా మండలి, వ్యవసాయ సలహా మండలి ప్రత్యేక సమావేశం కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ జిల్లాలో పలు ప్రాంతాలతో పాటు ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని 4 మండలాల్లో వర్షపాతం లోటు ఎక్కువగా ఉందని తెలిపారు. ఖరీఫ్ సాగు కూడా తక్కువగానే జరిగిందని అన్నారు. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ వచ్చేటట్లు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు తెలిపారు. ఈ-క్రాప్ చేయించుకున్న రైతులందరికీ ఉచిత పంటల బీమా వర్తింపజేయాలని సూచించారు. ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలో రబీ పంటలకు సాగునీరు ఇవ్వలేమని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ స్పష్టం చేశారు. రబీకి ఈ సీజన్‌లో 90 శాతం కంటే తక్కువ వర్షపాతం నమోదు కావడమే దీనికి కారణమని ఆయన అన్నారు. వంశధార, నాగావళి నదులపై ఉన్న ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు డెడ్ స్టోరేజ్‌కి చేరుకున్నాయని, రైతులు రబీకి వరి కాకుండా వేరుశనగ, నువ్వులు, పెసలు, మినుములు, రాగి, కట్టే జనుమ లాంటి ఆరుతడి పంటలు వేసుకోవాలని కోరారు. జనవరికి 4263 టన్నుల విత్తనాలు కూడా సిద్ధం చేసినట్టు చెప్పారు. రైతులకు ఈ విషయాలపై అవగాహన కల్పించేందుకు కరపత్రాలు ముద్రించాలని, ప్రసార మాధ్యమాల సహాయం తీసుకోవాలని సూచించారు. ఈనెల 30 నాటికి జిల్లాలో కొన్ని మండలాల కరువు పరిస్థితులు గురించి ఆ శాఖ కమిషనర్‌కి పూర్తి నివేదికలు సిద్ధం చేసి పంపాలని ఆదేశించారు. గుర్రపు డెక్కల తొలగింపు కోసం ఆయాచోట్ల రసాయనాలు జల్లే పద్ధతిని పరిశీలించాలన్నారు. ప్రధాన నదులలో నీటి ప్రవాహం, రిజర్వాయర్‌లలో నీటి నిల్వలపై కలెక్టర్ చర్చించారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ ఈ సారి ధాన్యం కొనుగోలు ప్రక్రియ రైతులకు వెంటనే నగదు వారి ఖాతాల్లో జమ అయ్యేలా ఉంటుందని స్పష్టం చేశారు. సిబ్బందికి శిక్షణలు పూర్తి చేశామని, ఈ సారి జీపీఎస్, బయో మెట్రిక్ పరికరాలు తప్పనిసరి చేశామని, సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి, ఇప్పటి నుంచే పరిస్థితులను అవగాహన చేసుకోవాలన్నారు. రైతులకు ఈ ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేకించి రూపొందించిన వీడియోలను సామాజిక మాధ్యమాల ద్వారా చెరవేయాలన్నారు.

సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ కె.శ్రీధర్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శిమ్మ నేతాజీ, వ్యసాయ మండలి సభ్యులు పీసా శ్రీహరి, అగ్రిమిషన్ సభ్యులు గుండ రఘురాం, వంశధార పర్యవేక్షక ఇంజినీర్ డోల తిరుమల రావు, ఇరిగేషన్ ఎస్‌ఈ పొన్నాడ సుధాకర రావు, నీటి పారుదల సలహా మండలి, వ్యవసాయ సలహా మండలి సభ్యులు, నీటి పారుదల శాఖ అధికారులు, అనుబంధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

అత్తమామలే హతమార్చారు

- కోడలిని హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరణ
- నెల తర్వాత భయంతో పోలీసులకు లొంగుబాటు

ఇచ్ఛాపురం రూరల్: ఇల్లాలిని కూతురిలా చూసుకోవాల్సిన అత్తమామలు ఆమె పాలిట కాలయములయ్యారు. కోడలిని కర్కశంగా హత్య చేసి ఆత్మహత్య చేసుకుందని అందరినీ నమ్మించారు. నెల రోజులుగా ఎవరికి దొరి కిపోతామో అని భయపడుతూ చివరకు పోలీసులకు లొంగిపోయా రు. వివరాల్లోకి వెళితే..

ఇచ్ఛాపురం మండలం నీలాపపుట్టుగ గ్రామానికి చెందిన నీలాపు మీనాకుమారి(22) ఈ ఏడాది అక్టోబర్ 7న ఇంటిలోనే ఉరి వేసుకొని మృతి చెందినట్లు అత్తమామలు నీలాపు అన్నపూర్ణ, జగ్గారావులు పోలీసులకు తెలిపారు. అయితే అప్పట్లో మీనాకుమారి తల్లి మోహిని తన కూతురు మృతి అనుమానాస్పదంగా ఉందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు పోలీసులు కూడా కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ దర్యాప్తు జరుగుతుండగానే అత్తమామలు గురువారం పోలీసులఎదుట లొంగిపోయారు. తామే చంపేశామని ఒప్పుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం సీఐ ఆర్.ఈశ్వర చంద్రప్రసాద్ తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మృతురాలు మీనాకుమారి భర్త మోహనబాబు ఏడు నెలల కిందట పోలెండ్ దేశానికి ఉపాధి కోసం వెళ్లిపోయాడని, అప్పటి నుంచి మీనాకుమారితో అత్తమామలకు గొడవలు జరుగుతున్నాయని తెలిపారు. అక్టోబర్ 8న సాయంత్రం మరోమారు గొడవ జరగడంతో మామ జగ్గారావు కర్రతో మీనాకుమారి తలపై బలంగా కొట్టడంతో ఆమె పడిపోయిందని, మళ్లీ లేవాక మరోసారి గొడవ పడడంతో అత్తమామలు కలిపి పీక నులిమి చంపేశారని వివరించారు. ఈ విషయాన్ని పక్కింటికి చెందిన నీలాపు హేమారావుకు చెప్పడంతో ఆయన సాక్ష్యాలను తారుమారు చేశాడని, రక్తపు మరకల్ని తుడేచేసి, మృతురాలు ఒంటిపై ఉన్న పంజాబీ డ్రస్సును తొలగించి నైటీలోకి మార్చి మంచంపై పడుకోబెట్టి ఉరిపోసుకొని మృతి చెందినట్లు గ్రామస్తులు, మృతురాలి తల్లిదండ్రులకు, పోలీసులను నమ్మించడానికి ప్రయత్నించారని తెలిపారు. అయితే పోస్టుమార్టం రిపోర్టులో ఇది హత్యగా తేలిపోతుందని, తాము దొరికిపోతామని భయపడిన అత్తమామలు గురువారం పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు తెలిపారు. వారిని సోంపేట కోర్టుకు తీసుకువెళ్లి అక్కడ నుంచి శ్రీకాకుళం తరలిస్తున్నామని తెలిపారు. సమావేశంలో రూరల్ ఇన్‌చార్జి ఎస్ఐ కె.గోవిందరావు, హెచ్‌సీ వై.రమణ, కానిస్టేబుల్ కిరణ్, అనూష, కనకమ్మ, రామరావులు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ ఈశ్వర చంద్ర ప్రసాద్, ఎస్ఐ గోవిందరావులు

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

శ్రీకాకుళం అర్బన్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా ఈనెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కుమార్‌రాజు తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో గల శాఖా గ్రంథాలయాధికారులు, గ్రామీణ గ్రంథాలయాధికారులతో శ్రీకాకుళం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. కుమార్ రాజు మాట్లాడుతూ జిల్లాలోగల శాఖా గ్రంథాలయాధికారులు వారోత్సవాలను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా జాతీయ గ్రంథాలయ వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా శాఖా గ్రంథాలయాధికారులు, గ్రామీణ గ్రంథాలయ పాలకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కుమార్‌రాజు

మందసలో అక్రమ రేషన్ బియ్యం పట్టివేత


అక్రమ రేషన్ బియ్యాన్ని పట్టుకున్న అధికారులు

మందస: మందస పట్టణంలోని కొండివీధిలో అధికారులు అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని శుక్రవారం పట్టుకున్నారు. బత్తుల మోహనరావుకు చెందిన గోదాములో అక్రమంగా నిల్వ ఉంచిన పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టం(పీడీఎస్) 27 బస్తాల బియ్యాన్ని సీజ్ చేసినట్టు జిల్లా సప్లయి అధికారి రమణ చెప్పారు. సీఎస్, ఎన్‌ఫోర్స్‌మెంటు డీటీలు శానాపతి రవికుమార్, గోపాలరావు, వీఆర్వో యు.బైరాగిలు గోదాములో తనిఖీ చేయగా, 50 కిలోల మూటలు 27 ఉన్నట్లు గుర్తించామన్నారు. 1380 కిలోల బియ్యం మార్కెట్‌లో రూ.54.44వేలు ఉంటుందన్నారు. ఉచిత బియ్యాన్ని ప్రజా పంపిణీ వ్యవస్థ పేదలకు అందజేస్తుండగా, వారి వద్ద మోహనరావు నిబంధనలకు విరుద్ధంగా కొనుగోలు చేస్తున్నాడన్నారు. నిందితునిపై 6ఎ కేసు నమోదు చేసి, స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని పలాస ఎంఎల్‌ఎస్ పాయింట్‌కు తరలించినట్టు తెలిపారు.

ఇళ్ల స్థలాల నిర్ణయంపై జర్నలిస్టుల హర్షం


సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న జర్నలిస్టులు

ఎల్.ఎన్.పేట: రాష్ట్రంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై పాతపట్నం నియోజకవర్గంలోని పాత్రికేయులు, టీవీ జర్నలిస్టులు హర్షం ప్రకటించారు. పాతపట్నంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే రెడ్డి శాంతికి పుష్పగుచ్ఛం ఇచ్చి, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే రెడ్డి శాంతితో కలసి పాత్రికేయులు సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. జర్నలిస్టులు సీపాన నాగభూషణరావు, అల్లు నర్సింహారావు, కంచరాన రవికుమార్, వైశ్యరాజు శ్రీనివాసరావు, చింతాడ అర్జునుడు, కర్నం సింహాచలం, గోవిందరావు, చాణక్య శ్రీరాం, భాస్కరరావు, రామిరెడ్డి, క్రాంతి, సింహాచలం, విలోచనబాబు, రామారావు, మోహన్, శ్రీనివాసరావు, దాసు, రమణ పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి జర్నలిస్టుల క్షీరాభిషేకం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు కేబినెట్‌లో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సమక్షంలో నిర్ణయించడం హర్షణీయమని జర్నలిస్ట్ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శ్రీకాకుళంలోని ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ నుంచి ఏడురోడ్ల కూడలి వరకు ర్యాలీగా వెళ్లి శుక్రవారం సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఏపీడబ్ల్యూజే-ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాణ వేణుగోపాల్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలు తెలిసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సానుకూలంగా స్పందించి ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు నిర్ణయించారన్నారు. అక్రిడేషన్ ఉన్న జర్నలిస్టులతో పాటు అందరినీ గుర్తించి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. ఏపీజేఎఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి శాసపు జోగినాయుడు, ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి డాక్టర్ డోల అప్పన్న, డాక్టర్ తిత్తి ప్రవీణ్, జాప్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంజి ఆర్.ఎజ్రా, సాక్షి బ్యూరో ఇన్‌చార్జి కందుల శివశంకరరావు పాల్గొన్నారు.


ఎల్.ఎన్.పేట: సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి జర్నలిస్టులతో కలసి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

14న డిగ్రీ బీఓఎస్, ఐటీఈపీ డిగ్రీ కరిక్యులమ్ డిజైన్‌పై సమీక్ష

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఈ నెల 14వ తేదీన డిగ్రీ బోర్డ్ ఆఫ్ స్టడీస్, కొత్తగా వర్సిటీలో ప్రవేశ పెడుతున్న నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం కరిక్యులమ్ డిజైన్‌పై సమీక్ష నిర్వహించనున్నట్లు అకడమిక్ అఫైర్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య తెలిపారు. వర్సిటీలో ఆయన శుక్రవారం మాట్లాడుతూ డిగ్రీ కోర్సుల సిలబస్ కూర్పు, పరీక్షల నిర్వహణ, అకడమిక్ ఏడాది నిర్వహణపై చర్చించనున్నట్లు చెప్పారు. వర్సిటీలో ప్రవేశ పెడుతున్న నాలుగేళ్ల డిగ్రీ+బీఎడ్ కోర్సు సిలబస్, అకడమిక్ క్లాస్‌వర్క్ డిజైన్‌పై సమీక్ష జరుగుతుందని తెలిపారు. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా ఈ కోర్సు డిజైన్ ఉంటుందని అన్నారు.

గురుకుల పాఠశాల పరిశీలన

పాతపట్నం: పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ఇప్పటి నుంచే కృషి చేయాలని సాంఘిక సంక్షేమ గురుకుల జిల్లా సమన్వయాధికారి ఎస్.బాలాజీ అన్నారు. మండలంలోని ప్రహరాజపాలేంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని, పదో తరగతి, ఇంటర్‌లో మెరుగైన ఫలితాలు రావాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు. పదో తరగతి విద్యార్థులకు ఆంగ్లంపై పలు ప్రశ్నలు వేసి, జవాబులు రాబట్టారు. విద్యార్థులకు పెడుతున్న భోజనం పరిశీలించారు. ఆయనతో పాటు ప్రిన్సిపాల్ ఆర్‌వీ కృష్ణతార, వైస్ ప్రిన్సిపాల్ వి.అర్చన, కేవీ రామూర్తి, త్రినాథరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పదో తరగతి విద్యార్థులకు బోధిస్తున్న సాంఘిక సంక్షేమ గురుకుల జిల్లా సమన్వాధికారి బాలాజీ

రీ సర్వే పనుల్లో పురోగతి చూపాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: భూ రికార్డుల స్వచ్ఛీకరణలో భాగంగా చేపట్టిన జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష పథకానికి సంబంధించి ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా రీ సర్వే పనుల్లో పురోగతి చూపాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అధికారులను ఆదేశించారు. సామర్థ్యాన్ని నిరూపించుకోవడానికి ఇదే గొప్ప అవకాశమని ఆయన అన్నారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌తో కలిసి ఆర్డీఓలు, తహసీల్దార్లతో కలెక్టర్ కార్యాలయంలో 132 చోట్ల జరుగుతున్న రీ సర్వే మూడో దశ పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. పనులకు సిబ్బంది కొరత లేదని, ప్రతి రోజూ ఒక్కో గ్రామంలో కనీసం 20 ఎకరాలకు తక్కువ కాకుండా క్షేత్ర స్థాయిలో సర్వే పూర్తి కావాల్సిందేనని స్పష్టం చేశారు. మొబైల్ మెజిస్ట్రేట్ బృందం సమస్యలను అక్కడికక్కడే పరిష్కారం చూపాలని, లేదంటే అప్పీల్స్ పెరిగే అవకాశం ఉందన్నారు. సమావేశంలో టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి రావు, ప్రత్యేక ఉప కలెక్టర్ జయదేవి, పద్మావతి, ఆర్డీఓలు సీహెచ్ రంగయ్య, భరత్ నాయక్, సర్వే అసిస్టెంట్ డైరక్టర్ అర్.విజయ్ కుమార్, అన్ని మండలాల తహసీల్దార్ లు, కలెక్టరేట్ ఏఓ రాజేశ్వరరావు, సూపరింటెండెంట్లు సిబ్బంది హాజరయ్యారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

24న ఆదిత్యుని తెప్పోత్సవం


పాలక మండలి సమావేశం జరుగుతున్న దృశ్యం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి హంస నావికోత్సవం ఈ నెల 24న ఘనంగా నిర్వహించాలని ఆలయ పాలకమండలి తీర్మానించింది. ఈ మేరకు శుక్రవారం ఉదయం స్థానిక ఆలయంలో ఈఓ వి.హరిసూర్యప్రకాష్ ఆధ్వర్యంలో పాలకమండలి సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు సభ్యులు ఉత్సవ ఏర్పాట్లపై తమ నిర్ణయాలను తెలియజేశారు. సమావేశంలో పాలకమండలి ఎక్స్‌అఫీషియో మెంబర్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, పాలకమండలి సభ్యులు మండవిల్లి రవి, ఎస్.కోటేశ్వర చౌదరి, లుకలాపు గోవిందరావు, డాక్టర్ సోమేశ్వరరావు, ద్వారపు అనూరాధ, జె.శ్రీనివాస్, దుక్క గనిరాజు, జోగి మల్లెమ్మ, మైలపల్లి లక్ష్మి తదితరులు, ఆలయ సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.


పాలకమండలి సమావేశంలో తీర్మానించిన అంశాలివే..

- ఈ నెల 24న సాయంత్రం అరసవల్లి ఇంద్రపుష్కరిణిలో క్షీరాబ్ధి ద్వాదశి (హంసనావికోత్సవం) నాడు గత లోపాలను సరిదిద్దుకుని పక్కా ఏర్పాట్లు చేయాలి.
- పుష్కరిణిలో శ్రీవారి ఉత్సవమూర్తులతో ఉన్న హంసవాహనంలోకి ధార్మిక (అర్చకులు) సిబ్బంది మినహాయించి మరెవ్వరికీ అనుమతి ఇవ్వకూడదు.
- పుష్కరిణి చుట్టూ అందమైన విద్యుత్ అలంకరణ, భక్తులకు అన్ని విషయాలు, ఏర్పాట్లు, సౌకర్యాల వివరాలు తెలిసేలా ఫ్లెక్సీలు, సూచిక బోర్డులు ఏర్పాట్లు చేయాలి.
- హంసనావికోత్సవం (తెప్పోత్సవం) నాడు ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు గర్భాలయంలో ఆదిత్యుని మూలవిరాట్టుకు పూర్తిగా స్వర్ణాలంకరణతోనే భక్తులకు దర్శనం కలిగేలా చర్యలు చేపట్టాలి.
- స్థానిక ఆలయం ఎదురుగా ఉన్న 12 సెంట్ల నివాస స్థలాన్ని దేవస్థానం నిధులతో కొనుగోలు చేయడానికి ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపించాలని కూడా ట్రస్ట్ బోర్డు సభ్యులు నిర్ణయించారు.

● నవ్వులే దివ్వెలై


మడియారపుట్టుగ పాఠశాలలో దీపావళి వేడుకల్లో చిన్నారులు.


మతాబులు,కాకరొత్తులు కాల్చుతున్న చిన్నారులు.


సత్యభామా,శ్రీకృష్ణుల వేషధారణలో నరకాసురవధ ఘట్టంలో కల్యాణిస్కూల్ బాలికల ప్రదర్శన

కవిటి మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో శుక్రవారం ముందస్తుగా దీపావళి సంబరాలు నిర్వహించారు. చిన్నారులు దీపాలు వెలిగించి నరకాసుర వధ ఘట్టాలను ప్రదర్శించారు. బాణసంచా పేల్చి సందడి చేశారు. – కవిటి

'నాణ్యత లోపించకూడదు'

జలుమూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న గోరుముద్దలో నాణ్యత లోపించకూడదని డీఈఓ కె.వెంకటేశ్వరరావు అన్నారు. ఆయన శుక్రవారం మాకివలసలో ఎయిడెడ్ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ఆయా పాఠ్యాంశాలలో నేర్చుకున్న అంశాలు, ఉపాధ్యాయుల బోధన పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. అలాగే విద్యార్థులకు విలువలతో కూడిన గుణాత్మక విద్య బోధించాలని అన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం పరిశీలించి మెనూ ప్రకారం వండాలని ఆదేశించారు. ఆయనతోపాటు ఎంఈఓలు బి.మాధవరావు, ప్రసాదరావు, సీఆర్పీ శంకరరావు సిబ్బంది ఉన్నారు.